నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

13 | హైదరాబాద్, ఆదివారం 17 మార్చి 2024 | HYDERABAD



రాంనగర్‌లో ఎమ్మెల్యే ముఠా గోపాల్..



జేబీఎస్ చౌరస్తాలో నల్ల జెండాలతో మాజీ కార్పొరేషన్ చైర్మన్ మన్నె క్రిశాంక్, బీఆర్ఎస్ నాయకులు



పర్వత్‌నగర్ చౌరస్తాలో రాస్తారోకోలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్



మహేశ్వరంలో ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



డైమండ్ పాయింట్ చౌరస్తాలో ఆందోళన చేస్తున్న రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేశ్




లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్



అంబర్‌పేట అలీకేఫ్ చౌరస్తా వద్ద నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, బీఆర్ఎస్ శ్రేణులు

# ప్రజాస్వామ్యానికి విరుద్ధం

- నినాదాలతో హోరెత్తించిన బీఆర్ఎస్ శ్రేణులు
- ఈడీ, మోదీకి బెదిరేదిలేదంటూ హెచ్చరికలు
- పలు చోట్ల పీఎం దిష్టిబొమ్మల దహనం

## ఎమ్మెల్సీ కవిత అక్రమ అరెస్టుపై గ్రేటర్‌వ్యాప్తంగా వెల్లువెత్తిన నిరసనలు

ఎమ్మెల్సీ కవిత అక్రమ అరెస్టుపై శనివారం గ్రేటర్‌వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. పీఎం మోదీ, ఈడీకి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. 'బీజేపీ డౌన్ డౌన్' తెలంగాణ ఉద్యమ తడాఖా చూపిస్తాం' 'ఎన్ని కేసులు పెట్టినా బెదిరేదే లేదు' అంటూ గొంతెత్తారు. బంజారాహిల్స్, అంబర్‌పేట, కంటోన్మెంట్, సికింద్రాబాద్, ఎల్బీనగర్, నాంపల్లి, ముషీరాబాద్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్సీ కవిత అక్రమ అరెస్టుకు నిరసనగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నిరసనలతో హోరెత్తించారు. నరేంద్ర మోదీ దిష్టిబొమ్మలను దహనం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసమే బీజేపీ, కాంగ్రెస్‌లు కలిసిపోయాయని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశం ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ తడాఖాను ప్రధాని మోదీకి మరోసారి చూపించే సమయం ఆసన్నమైందని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం వినిపిస్తున్న వారిపై విచారణ సంస్థలను ఉసిగొల్పుతున్నట్లు ఎమ్మెల్యే సబితాఇంద్రా రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీకి కేసీఆర్ తలొగ్గలేదనే కవితను అరెస్ట్ చేయించారని ఎమ్మెల్సీ నవీన్ అన్నారు.

–సిటీబ్యూరో, మార్చి 16 ( నమస్తే తెలంగాణ )



బోరబండలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్..



మల్కాజిగిరి చౌరస్తాలో నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



మల్లాపూర్‌లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



ఎల్బీనగర్ రింగ్‌రోడ్డులో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా..



పీర్జాదిగూడ వరంగల్ జాతీయ రహదారిలో పీఎం మోదీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న మేయర్ వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు

## కంటోన్మెంట్ ఉప ఎన్నిక మే 13న

సిటీబ్యూరో, మార్చి 16 ( నమస్తే తెలంగాణ ) : మే 13న లోక్‌సభ ఎన్నికలతో పాటు అదే రోజున సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గానికి పోలింగ్ జరగనున్నది. ఇక్కడి నుంచి బీఆర్ఎస్ తరపున ఎమ్మెల్యేగా గెలిచిన లాస్య నందిత ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం తెలిసిందే. దీంతో కంటోన్మెంట్‌లో ఉప ఎన్నిక నిర్వహిస్తున్నట్టు ఈసీ ప్రకటించింది. ఏప్రిల్ 18న కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి నోటిఫికేషన్ విడుదల కానున్నది. ఆ వెంటనే నామినేషన్ల స్వీకరణ మొదలవుతుంది. మే 13న పోలింగ్ నిర్వహించి జూన్ 4న ఓట్లను లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారు. కాగా, కంటోన్మెంట్‌తో పాటు పలు రాష్ట్రాల్లోని 26 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు జరుగుతాయని ఎన్నికల అధికారులు తెలిపారు.

## 24 గంటల్లో వర్ష సూచన



సిటీబ్యూరో, మార్చి 16 (నమస్తే తెలంగాణ): ఉపరితల ద్రోణి ప్రభావంతో నగర వాతావరణం కొంత చల్లబడింది. బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి కొనసాగుతుండటం వల్ల రాగల 24 గంటల్లో గ్రేటర్‌లో అక్కడక్కడ తేలికపాటి జల్లులు కురిసే అవకాశాలు ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. కాగా, శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 34.4, కనిష్ఠం 23.0 డిగ్రీలు, గాలిలో తేమ 50 శాతంగా నమోదైనట్లు అధికారులు తెలిపారు.

ఏప్రిల్ 18న నోటిఫికేషన్..

# ఏప్రిల్ 14 వరకు ఓటు నమోదు



25వరకు నామినేషన్ల స్వీకరణ ✦ జూన్ 4న కౌంటింగ్

### హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్

సిటీబ్యూరో, మార్చి 16 (నమస్తే తెలంగాణ): జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ స్పష్టం చేశారు. శనివారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నగర సీపీ శ్రీనివాస్‌రెడ్డి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్‌తో కలిసి మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా ఎన్నికల నిర్వహణపై ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ మాట్లాడారు. గత శాసనసభ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించామని, కొన్నిచోట్ల కలిగిన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని లోక్‌సభ ఎన్నికలకు సర్వం సిద్ధం చేశామన్నారు. అవసరమైన ఈవీఎంలు, సిబ్బందిపై పూర్తిస్థాయి ఏర్పాట్లు చేసుకున్నామన్నారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియామావళి శనివారం నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. ఏప్రిల్ 18న నోటిఫికేషన్ వెలువడుతుందని, 25 వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. మే 13న ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని, జూన్ 4న కౌంటింగ్ ఉంటుందన్నారు.

#### రెండు పార్లమెంటరీ స్థానాలు..

హైదరాబాద్ జిల్లాలో హైదరాబాద్, సికింద్రాబాద్ రెండు పార్లమెంటరీ నియోజకవర్గాల్లో 15 అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయన్నారు. ఎలక్షన్ కోడ్ అమలులోకి వచ్చినందుకు ఎన్నికల ప్రవర్తన నియామావళిని కట్టుదిట్టంగా అమలు చేస్తామన్నారు. జిల్లాలో మొత్తం 45,70,138 మంది ఓటర్లు ఉన్నారని, ఇందులో పురుషులు 23,30,574, మహిళలు 22,39,240 , థర్డ్ జెండర్ 324, సర్వీస్ ఓటర్లు 402, 846 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఏప్రిల్ 14 వరకు కొత్త ఓటరు నమోదుకు అవకాశం ఉందని కమిషనర్ రోనాల్డ్ రాస్ తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు చర్యలు చేపడుతామని వివరించారు. ఎన్నికల ప్రవర్తనా నియామావళిని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

## పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి

పోలింగ్ కేంద్రాల్లో మెరుగైన మౌలిక వసతలు కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో టాయిలెట్లు, తాగునీరు వంటివి తప్పనిసరిగా ఉండాలని, సహాయ రిటర్నింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక రూపొందించాలన్నారు. శనివారం సాయంత్రం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్, డీజీపీ రవిగుప్తాలతో ఎన్నికల అధికారుల వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మూడు చొప్పున టీమ్‌లు మూడు షిఫ్టులలో 24గంటల పాటు పనిచేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. అదేవిధంగా ప్రైవేటు ప్రాపర్టీ, వెబ్‌సైట్‌లలో ప్రజాప్రతినిధులకు సంబంధించిన ఫొటోలు, ఫ్లెక్సీలు, వాల్ రైటింగ్‌లను తొలగించి నివేదిక ఇవ్వాలన్నారు. ఎన్నికల ప్రచారానికి అవసరమైన సింగిల్ విండో పద్ధతిలో అనుమతులను ఆన్‌లైన్‌లో సువిధ ద్వారా పొందేలా రాజకీయ పార్టీలకు అవగాహన కల్పిస్తామన్నారు. సమావేశంలో హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్ పాటిల్, ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధలతో చక్రస్నానం

జూబ్లీహిల్స్‌లోని టీటీడీ శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి శనివారం భక్తిశ్రద్ధలతో చక్రస్నానం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణ మధ్య శంఖు చక్రాలను పుష్కరిణిలోకి తీసుకువెళ్లి శాస్త్రోక్తంగా స్నానం చేయించారు. సాయంత్రం ధ్వజారోహణం కార్యక్రమాన్ని చేపట్టారు.

–బంజారాహిల్స్,మార్చి 16

# రూ. 3.36 కోట్లతో ల్యాండ్ స్కేపింగ్

### అమీన్‌పూర్ మున్సిపాలిటీలో పార్కుల అభివృద్ధి

సిటీబ్యూరో, మార్చి 16 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ శివారు ప్రాంతాల్లో ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ అధిక ప్రాధాన్యతనిస్తున్నది. జీహెచ్ఎంసీ పరిధి దాటిన తర్వాత కొత్తగా అభివృద్ధి చెందుతున్న మున్సిపాలిటీలు, ఇతర కార్పొరేషన్లలో అవసరమైన అభివృద్ధి పనుల కోసం హెచ్ఎండీఏ ప్రత్యేకంగా నిధులను కేటాయించడంతో పాటు ఆయా పనులను స్వయంగా చేపడుతున్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత హైదరాబాద్ మహానగరం ఎవరూ ఊహించని విధంగా ఔటర్ రింగు రోడ్డు దాటి విస్తరిస్తున్నది. ఈ నేపథ్యంలో పట్టణీకరణకు అనుగుణంగా పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా జీవ వైవిధ్యానికి ప్రాధ్యానిస్తూ హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్ పరిధిలో పచ్చదనం పెంపొందించేందుకు చెరువుల సుందరీకరణ, పార్కుల నిర్మాణం వంటి పనులను హెచ్ఎండీఏ చేపడుతున్నది. తాజాగా గ్రేటర్ శివారులోని అమీన్‌పూర్ మున్సిపాలిటీలో 2 చోట్ల ఉన్న చెరువులు, మరో 2 పార్కుల అభివృద్ధికి మొత్తం రూ. 3.36 కోట్ల నిధులతో ల్యాండ్ స్కేపింగ్ పనులను హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్రీ విభాగం చేపట్టనున్నది. హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న లేక్ ప్రొటెక్షన్ కమిటీ చెరువుల సరిహద్దులను నిర్ణయించి వాటి పరిరక్షణకు చర్యలు చేపడుతుండగా, ఆయా చెరువులన్నీ స్థానికులకు ఆహ్లాదకరంగా ఉండేందుకు వాటిని అందమైన పచ్చిక బయళ్లతో తీర్చిదిద్దుతున్నది హెచ్ఎండీఏ.



అమీన్‌పూర్ మున్సిపాలిటీలో హెచ్ఎండీఏ చేపట్టే పచ్చదనం పనులు

| | |
|---|---|
| తులసీవనం లేక్ | రూ.74,98,083.00 |
| శంభునికుంట లేక్ | రూ. 74,64,700.00 |
| పంచతత్వ పార్కు | రూ. 7435871.00 |
| లింగమయ్య పార్కు | రూ.1,39,89,536.00 |

# నిషేధిత రసాయనాలతో మామిడి మక్కబెట్టి..

సిటీబ్యూరో: ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే నిషేధిత ఇథిలిన్ రైపర్స్‌తో మామిడిపండ్లను మక్కబెట్టి సొమ్ము చేసుకుంటున్న ఇద్దరు వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.3 లక్షల విలువ చేసే మామిడిపండ్లను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మీపెరుమాల్ కథనం ప్రకారం...ఆసిఫ్‌నగర్‌కు చెందిన ఇర్ఫాన్‌ఖాన్(35) మోజంజాహి మార్కెట్‌లో న్యూ లిబర్టీ ఫ్రూట్‌షాప్‌ను నిర్వహిస్తున్నాడు. ఆగాపురా, దారుల్ సలాం ప్రాంతానికి చెందిన మహ్మద్ హుస్సేన్ (47) సైతం అదే మార్కెట్‌లో లక్కీ ఫ్రూట్‌షాప్ పేరుతో పండ్ల దుకాణం నిర్వహిస్తున్నాడు. అయితే ఇద్దరు నిందితులు ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే విధంగా నిషేధిత ఇథిలిన్ రైపర్స్‌తో మామిడికాయలను కృత్రిమంగా పండిస్తున్నారు. ప్రస్తుతం రంజాన్ మాసం కావడంతో పాటు మామిడి పండ్లకు మంచి డిమాండ్ ఉండటంతో అక్రమ మార్గంలో డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో హానికరమైన ఇథిలిన్ రైపర్స్‌తో పండ్లను మక్కబెడుతూ.. సొమ్ము చేసుకుంటున్నారు. సమాచారం అందుకున్న సౌత్ వెస్ట్‌జోన్ పోలీసులు శనివారం మోజంజాహి మార్కెట్‌లోని లక్కీ, న్యూ లిబర్టీ ఫ్రూట్‌షాప్‌లపై దాడులు జరిపారు. రూ.3లక్షల విలువ చేసే మామిడిపండ్లు, కాయలు, నిషేధిత ఇథిలిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.